




# ప్రచారంలో కీలకంగా సోషల్ మీడియా!

## సోషల్ మీడియాను నమ్ముకుంటున్న పార్టీలు

- అభ్యర్థుల వారీగా డెస్క్‌లు ఏర్పాటు సామాజిక మాధ్యమాలపై
- అవగాహన ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు
- సబ్‌స్క్రైబర్స్ అధికంగా ఉన్న యూట్యూబ్ పేజీలకు డిమాండ్

రామచంద్రాపురం, అక్టోబర్ 12: సోషల్ మీడియా.. ఇప్పుడు రాజకీయ పార్టీల ప్రచారంలో కీలకంగా మారింది. అభ్యర్థుల గెలుపోటములను శాసించే స్థాయికి ఎదిగింది. సమాచారం సెకన్లలో లక్షలాది మందిని చేరుతుండటంతో ఇప్పుడు పార్టీలన్నీ సామాజిక మాధ్యమాల వైపు చూస్తున్నాయి. ముఖ్యంగా ఆశావహులు ప్రత్యేకంగా వారి ప్రచారానికి సంబంధించి సోషల్ మీడియా డెస్క్‌లు ఏర్పాటు చేసుకొని... రోజువారీ ప్రచార వివరాలు, ప్రజలతో మమేకమయ్యే సందర్భాలను సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయడానికి అవగాహన ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నారు. అభ్యర్థికి పాజిటివ్ అంశాలను జత చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలను రూపొందించి షేర్ చేయడానికి వీడియో ఎడిటర్లు, ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్లు, కంటెంట్ రైటర్లను నియమించుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్, ఇన్‌స్టా, వాట్సాప్ చానెల్ ఇలా అనేక సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు సోషల్ మీడియాలో తమకు టికెట్ వస్తుందని మద్దతు ఇవ్వాలని పోస్టులు వైరల్ చేసుకుంటున్నారు.

అభ్యర్థులు తమకు మద్దతుగా ప్రచారం చేయాలని అత్యధికంగా ఫాలోవర్స్ ఉన్న పేజీ నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. లక్ష సబ్‌స్క్రైబర్స్ ఉన్న యూట్యూబ్ పేజీకి ఓ ధర, ఆపై ఉన్న పేజీలకు ఓ ధరను నిర్ణయిస్తూ వారి మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇప్పటికే వార్త కంటెంట్‌తో ఉన్న యూట్యూబ్ పేజీలకు మరింత డిమాండ్ పెరిగింది. అభ్యర్థి ప్రచారం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు కంటెంట్ సృష్టించి వీడియోలు ప్రసారం చేసి అభ్యర్థికి ఆదరణ వచ్చేలా యాక్టివిటీ అంతా సోషల్ మీడియా నిర్వాహకులే చూసుకుంటారు. మొత్తంగా ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో కౌంటర్ ఎటాక్‌లతో జోరందుకోనుంది.





# మన చెరువు మహాసముద్రం

## సీఎం కేసీఆర్ విజన్‌తో 'మహాసముద్రం' చెరువుకు మహర్దశ



చుట్టూ గుట్టలు, ప్రకృతి అందాల మధ్య మహాసముద్రం గండి

- ప్రకృతి అందాల సోయగం... మెట్ట రైతన్నకు ఆధారం
- 'గండి' నిర్మాణంతో 20 గ్రామాల్లో పెరిగిన భూగర్భ జలాలు
- రూ.8.81 కోట్లతో నిర్మాణం పూర్తి
- భూనిర్వాసితులకు రూ.2.26 కోట్లు చెల్లింపు
- 'గండి'ని స్వయంగా సందర్శించి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్
- ఒకసారి చెరువు నిండితే రెండేండ్ల వరకు సాగునీటికి ఢోకా ఉండదు..
- వెయ్యి ఎకరాల ఆయకట్టుకు భరోసా



హుస్నాబాద్, అక్టోబర్ 12 : దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మహాసముద్రం చెరువు గండి పనులకు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మోక్షం లభించింది. చిన్ననీటి వనరు అయినా ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని గుర్తించిన సీఎం కేసీఆర్ ముందుచూపుతో రూ.6.55 కోట్లను కేటాయించి గండి పనులు పూర్తి చేయించారు. మరో 2.26కోట్ల నిధులను భూనిర్వాసితులకు పరిహారంగా ఇచ్చారు. మొత్తం రూ.8.81కోట్లతో గండి నిర్మాణం పూర్తి చేయించారు. ఏండ్ల నాటి కల నెరవేరడంతో హుస్నాబాద్, సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లోని పలు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గండి నిర్మాణానికి నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్, పనులు పూర్తి చేయించిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ గ్రామ శివారులో చుట్టూ గుట్టలు...గుట్టల మధ్య విశాలమైన లోయలో సహజ సిద్ధంగా ఏర్పడింది మహా సముద్రం చెరువు. చుట్టూ ఉన్న గ్రామాలకు సాగు, తాగునీరందించిన ఈ జల వనరును అప్పటి ప్రజలు 'మహా సముద్రం'గా పిలుచుకున్నారు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండి చుట్టు పక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచి రైతులకు సిరులు కురిపించిన మహాసముద్రం చెరువుకు ఆరు దశాబ్దాల క్రితం గండి పడింది. అప్పటి నుంచి ఈ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుంది. ఇందులోకి వచ్చే వరద వృథాగా దిగువకు వెళ్లిపోయేది. నీళ్లు నిల్వ ఉండక పోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని వ్యవసాయ బావుల్లో నీళ్లు అడుగంటడం మొదలైంది. మహాసముద్రం గండిని పూడ్చాలని దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు పాలకులను వేడుకుంటూ వచ్చారు.

### అర టీఎంసీ నీటి నిల్వ..

మహాసముద్రం గండిలో 0.5 టీఎంసీ(అర టీఎంసీ)ల నీళ్లు నిల్వ ఉంటాయి. ఒకసారి ఇది నిండితే రెండేండ్ల పాటు వర్షాలు లేకున్నా చుట్టుపక్కల గ్రామాల్లో నీటికి కరువు ఉండదు. సుమారు 65ఎకరాల శిఖం భూములు కలిగిన గండికి నాణ్యతా ప్రమాణాలతో కూడిన మత్తడితో పాటు 17మీటర్ల ఎత్తుతో కట్ట నిర్మాణం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించి కేవలం మూడేండ్లలోనే నిర్మాణ పనులు పూర్తి చేయించారు. ఒకసారి నిండితే సుమారు వెయ్యి ఎకరాలకు పరోక్షంగా సాగునీరందిస్తుంది.

### మూడు మండలాల రైతులకు ఎంతో మేలు...




మహాసముద్రం గండి నిర్మాణంతో హుస్నాబాద్ పట్టణంతో పాటు మండలంలోని కొన్ని గ్రామాలు, సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లోని పలు గ్రామాల రైతులకు మేలు జరుగుతున్నది. గండి ప్రాధాన్యతను వివరించగానే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు స్పందించి వెంటనే నిధులు కేటాయించారు. వారికి ధన్యవాదాలు. ఉమ్మాపూర్ బయ్యన్న గుట్టలో ఆదిమానవులు జీవించిన ఆధారాలు కనిపిస్తాయి. గండితో హుస్నాబాద్, సైదాపూర్ మండలాల రైతుల కల నెరవేరింది. ఇది నిండితే సుమారు 20 గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రభుత్వం ఇచ్చే 24గంటల కరెంటుతో పాటు పెరిగిన భూగర్భ జలాలతో ఈ ప్రాంత రైతులు విరివిగా పంటలు పండించుకునే అవకాశం ఉంది. సొంత ప్రభుత్వం వస్తే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో మహాసముద్రం గండి పనులను చూసి అర్థం చేసుకోవచ్చు.

–వొడితెల సతీశ్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే



నిర్మాణం జరుగక ముందు మహాసముద్రం గండి ప్రాంతం



మత్తడి దూకుతున్న మహాసముద్రం గండి


### గండిని సందర్శించిన సీఎం కేసీఆర్...

మహాసముద్రం గండి ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ గండిని స్వయంగా సందర్శించి నిధులు మంజూరు చేశారు. ఆగస్టు 8, 2015న గండిని సందర్శించిన సీఎం అక్కడే జరిగిన బహిరంగ సభలో గండి నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తాత్కాలిక మరమ్మత్తులు కాకుండా శాశ్వతంగా ఉండేలా నిర్మాణం చేస్తామని చెప్పారు. ఇక్కడి ప్రశాంతమైన వాతావరణంలో సీఎం సుమారు రెండు గంటల పాటు గడిపారు. అంతకు ముందు అప్పటి రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గండిని సందర్శించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను అదేశించారు. స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో పాటు తెలంగాణ వికాస సమితి నాయకులు గండి ప్రత్యేకత, ప్రాధాన్యతను గురించి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు వివరించడంతో పనులకు మోక్షం కలిగింది. నవంబర్ 8, 2016లో మంత్రి హరీశ్‌రావు గండి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు పూర్తయి ఈ ప్రాంతంలో చిన్ననీటి వనరుగా గుర్తించబడింది.



### ప్రకృతి అందాలు, చారిత్రక ఆనవాళ్లకు నిలయం..

మహాసముద్రం గండి ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయంగా చెప్పవచ్చు. చుట్టూ పచ్చని గుట్టలు ఉండి పెద్ద పెద్ద వృక్షాలతో అలరారుతున్నది. గండి ప్రదేశంలోకి వెళ్లిన వారికి ఊటీ, కొడైకెనాల్ వెళ్లిన అనుభూతి కలుగుతుంది. వందలాది ఎకరాల్లో ఆవరించి ఉన్న గుట్టలు, అటవీ ప్రాంతం, వివిధ రకాల జంతువులు, పక్షులకు నిలయంగా ఉంటుంది. పక్షుల కిలకిల రావాలు శ్రవణానందాన్నిస్తాయి. బయ్యన్న గుట్టలో ఆదిమానవులు జీవించిన ఆనవాళ్లు అడుగడుగునా కనబడుతాయి. గుట్టపై ఉన్న బయ్యన్న విగ్రహాన్ని దర్శించుకునేందుకు ఇప్పటికీ భక్తులు ప్రతి శ్రావణ మాసంలో వెళ్తుంటారు. బయ్యన్న విగ్రహం చెక్కిన ప్రాంతంలో ఆదిమానవులు వాడిన వస్తువులు, చేదబావులు దర్శనమిస్తుంటాయి. ఇదే గుట్టలపై అయ్యప్ప దేవాలయాన్ని నిర్మించేందుకు హుస్నాబాద్‌కు చెందిన అయ్యప్ప భక్తులు పనులు మొదలు పెట్టారు.



ఉమ్మాపూర్ గుట్టల్లోని మహాసముద్రం గండి

# బీఆర్ఎస్ అసెంబ్లీ ఇన్‌చార్జిల నియామకం

- నియమించిన అధినేత కేసీఆర్
- వెల్లడించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం

సిద్దిపేట, అక్టోబర్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జిలను నియమించింది. జిల్లాలోని సీనియర్ నాయకులను ఆయా అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జిలుగా పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం రాత్రి విడుదల చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావుతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పార్టీ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ శాసనసభ స్థానానికి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారు. దుబ్బాక నియోజకవర్గానికి టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లును, మెదక్ నియోజకవర్గానికి కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని, ఆందోల్‌కు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ను, నర్సాపూర్‌కు ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్‌కు మాజీ బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, సంగారెడ్డికి రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను నియమించారు. వీరంతా ఆయా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తారు.

# సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

- గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలి
- కేడర్‌కు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పిలుపు
- మంత్రులను కలిసిన కొండాపూర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్

సంగారెడ్డి అక్టోబర్ 12(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కొండాపూర్ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, మల్కాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్‌లు హైదరాబాద్‌లో మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు వారితో మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే జరుగుతున్నదని, ఇకముందు కూడా బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. చిన్నచిన్న సమస్యలుంటే పక్కన పెట్టి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొండాపూర్ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్‌లు మంత్రులతో మాట్లాడుతూ సంగారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం తాము చిత్తశుద్ధితో పనిచేస్తామని, చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. మంత్రులను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, జిల్లా నాయకుడు జైపాల్‌రెడ్డి ఉన్నారు.



మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును కలిసిన కొండాపూర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్







# విద్యారంగానికే మణిహారం

దుబ్బాక టౌన్, అక్టోబర్ 12: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నది. విద్యార్థులకు సకల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నది. 'మనఊరు–మనబడి'తో పాఠశాలల రూపురేఖలే మారుతున్నాయి. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టక ముందే సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని సీఎం కేసీఆర్ చదివిన బడిని మోడల్ పాఠశాలగా నిర్మించారు. నాడు శిథిలావస్థలో ఉన్న బడిని సీఎం కేసీఆర్ స్వయంగా డిజైన్ చేయించి శంకుస్థాపన చేశారు. దేశంలో మోడల్ పాఠశాలగా నిర్మించారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, విశాలమైన గదులు, కాన్ఫరెన్స్ హాల్స్, ల్యాబ్‌లు నిర్మించారు. సుమారు రూ.10 కోట్లతో అత్యాధునిక పాఠశాల భవనం నిర్మించారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు ఈ భవనంలో ఓ పక్క ఉన్నత పాఠశాల, మరోపక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతున్నది. విద్యార్థులు ఉత్సాహంగా విద్యను అభ్యసిస్తున్నారు.

# పల్లాకు టికెట్ రావడంపై హర్షం

## కొమురవెల్లి మల్లన్నకు బీఆర్ఎస్ కార్యకర్త తలనీలాలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్12: జనగామ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిష్టానం ప్రకటించడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధూళిమిట్ట మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నాచగోని శ్రీనివాస్‌గౌడ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ వస్తే కొమురవెల్లి మల్లన్న స్వామికి తన తలనీలాలు సమర్పిస్తానని కొన్ని రోజుల క్రితం మొక్కుకున్నాడు. ఈ క్రమంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ దక్కడంతో శ్రీనివాస్‌గౌడ్ గురువారం కొమురవెల్లి మల్లన్న స్వామికి తన తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లన్న ఆశీస్సులతో పాటు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నిండుగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికలలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసం తలనీలాలు సమర్పించిన శ్రీనివాస్‌గౌడ్‌ను పలువురు బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.



కొమురవెల్లి మల్లన్నకు తలనీలాలు సమర్పించిన శ్రీనివాస్‌గౌడ్